క్లుప్తంగా

నిమ్మనపల్లె ఎంపీడీఓగా శేషగిరిరావు



నిమ్మనపల్లె : నిమ్మనపల్లె ఎంపీడీఓగా శేషగిరిరావు సాధారణ బదిలీల్లో భాగంగా నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీఓ లీలామాధవి చిత్తూరు జిల్లా నగరికి బదిలీ కాగా, నగరి ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా పని చేస్తున్న శేషగిరిరావు పదోన్నతిపై నిమ్మనపల్లెకు బదిలీ అయ్యారు. బుధవారం బాధ్యతలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక



రఘుపతికి నియామక పత్రాన్ని ఇస్తున్న జిల్లా నాయకులు

తంబళ్లపల్లె: ఎరుకుల హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షులుగా కె.రఘుపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ కమిటీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు రమణ, ప్రధాన కార్యదర్శి రెడ్డెయ్యల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా పెద్దవెంకటరమణ, మండల కార్యదర్శి జయరామ్, మహిళా కార్యదర్శి రమాదేవిలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లాకమిటీ సభ్యులు రమణ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

నేడు గడపగడపకు మన ప్రభుత్వం

వాల్మీకిపురం: మండలంలోని జర్రావారిపల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో షబ్బీర్ అహ్మద్, సర్పంచ్ మునిభాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరై గడప గడపకూ పర్యటించి, ప్రజల సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటారని వారు పేర్కొన్నారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

నాటుసారా స్వాధీనం

వాల్మీకిపురం : అక్రమంగా తరలిస్తున్న 50 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని, ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం సిబ్బందితో కలసి రాత్రి గస్తీ నిర్వహిస్తుండగా.. మండలంలోని చింతపర్తి పంచాయతీ మేకలవారిపల్లి క్రాస్ వద్ద ద్విచక్ర వాహనంపై 50 లీటర్ల నాటుసారాతో వెళ్తున్న తుపాకుల పెద్ద వెంకటరమణను అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. అతన్ని అరెస్ట్ చేసి, అతని వద్ద ఉన్న 50 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు వివరించారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీవోగా తిరుపాలప్ప




పెద్దతిప్పసముద్రం : ఉపాధి హామీ పథకం ఏపీవోగా తిరుపాలప్ప నియమితులై సోమవారం బాధ్యతలు చేపట్టినట్లు ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి తెలిపారు. ఈయన గతంలో అనంతపురం జిల్లా కనేకల్లు మండలంలో పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇన్నాళ్లు ఇక్కడ మహేష్ ఇన్‌చార్జి ఏపీవోగా పని చేశారు.

రేపు ఉపాధి బహిరంగ సభ

నిమ్మనపల్లె : 17వ విడత ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ ఈ నెల 14న బుధవారం జరుగుతుందని ఏపీఓ రమేష్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను ఉపాధి హామీలో చేపట్టిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ గ్రామస్థాయిలో పూర్తయిందన్నారు. బుధవారం ఉపాధి హామీ కార్యాలయం వద్ద జరిగే బహిరంగ సమావేశంలో తనిఖీ వివరాలను వెల్లడించనున్నట్లు తెలిపారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేఎన్‌టీయూ సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ భానుమూర్తి

మదనపల్లె సిటీ : ఇంజినీరింగ్ విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలని జేఎన్‌టీయూ సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ భానుమూర్తి అన్నారు. సోమవారం స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో సీఎస్‌సీ, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ఇంజినీరింగ్ అప్లికేషన్ల కోసం డేటా విశ్లేషణ సంబంధాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విద్యావిధానంలో ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ డేటా వల్ల కలిగే ఉపయోగాలపై వివరించారు. విద్యార్థులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మేధస్సును పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి, ప్రిన్సిపల్ సతీష్ బాబు, జయప్రకాష్, షఫీ పాల్గొన్నారు.

విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యం

- మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి
- జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ





పీలేరు రూరల్ : విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, పెద్దతిప్పసముద్రం: జేవీకే కిట్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

పీలేరు రూరల్ : విద్యకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మాజీ ఎమ్మెల్యే జి.వి.శ్రీనాథరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వేల కోట్లు ఖర్చు చేసి విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని పేర్కొన్నారు. నాడు నేడు పథకంలో పాఠశాలల రూపు రేఖలు మారిపోయాయన్నారు. మండలంలోని 6865 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హబీబ్‌బాషా, వైస్ ఎంపీపీ ఎస్.వి.చలపతి, నాయకులు హుమయూన్, పెద్దోడు, విజయశేఖర్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ సుబ్బారెడ్డి, ఇన్‌చార్జి హెచ్ఎం నటరాజ, సీఆర్పీ మురళీధర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమండ్యం : విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ఎండీసీ అధ్యక్షుడు గుర్రం రమేష్ అన్నారు. మండలంలోని కలిచెర్ల తెలుగు, ఉర్దూ ఉన్నత పాఠశాలలు, స్థానిక మోడల్ పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి జగనన్న విద్యాకానుక ద్వారా నోటు పుస్తకాలు, యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, బ్యాగు, బెల్ట్, డిక్షనరీ లను ఇస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని 4107 మంది విద్యార్థులకు ప్రభుత్వం జగనన్న విద్యాకానుక కిట్‌లు ఇచ్చినట్లు ఎంఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్‌రావు, తహసీల్దార్ రాము, ఎంఈవో మనోహర, ప్రిన్సిపల్ రామాంజులు నాయక్, వైస్ ప్రిన్సిపల్ అనీల్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు సోదనపల్లె బాషా, విశ్వనాథ, పద్మావతి, ఎంపీటీసీ మంచూరి జయరాం, కో ఆప్షన్ మెంబర్ ఖాదర్ వలీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులచే జేవీకే కిట్లను పంపిణీ చేసారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, జెడ్పీ హైస్కూల్‌లో ఎంపీపీ మహమూద్, సచివాలయ మండల కన్వీనర్ డ్రిప్ రమణ, ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి, ఎంఈఓ నారాయణ, కోఆప్షన్ ఖాదర్‌వలి, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ తమక శంకర్, కార్యం చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ శివకుమారిలు విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేసారు.

కలికిరి : పాఠశాలలు పునఃప్రారంభమైన మొదటి రోజునే విద్యార్థులకు విద్యాకానుక అందచేయడం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఘనత అని ఎంపీపీ నూర్జహాన్, గుట్టపాళెం సర్పంచ్ వెంకటరెడ్డి అన్నారు. కలికిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం సరఫరా చేసిన జగనన్న విద్యాకానుక(జేవీకే) కిట్లు విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ రంగనాథరెడ్డి, హెచ్ఎం శారద, ఉపాధ్యాయులు, సీఆర్పీలు సురేష్, భాస్కర్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రజాప్రతినిధులు హాజరై విద్యార్థులకు జేవీకే కిట్లు పంపిణీ చేశారు.

ములకలచెరువు : స్థానిక ఆదర్శ పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఎంపీపీ సాయిలీలా, జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, సర్పంచ్ రహమత్‌బి, ఎంపీటీసీ ఆయేషా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేస్తోందన్నారు. ఎంఈఓ వెంకట్రమణ, ప్రిన్సిపాల్ కవిత, స్కూల్ కమిటీ చైర్మన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్రంకొండ: జగనన్న విద్యాకానుకను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సద్రీన్ ముక్తియార్, ఎంఈవో సురేంద్రబాబులు అన్నారు. సోమవారం స్థానిక తెలుగు జెడ్పీహైస్కూల్లో విద్యార్థిని, విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్బీకే చైర్మన్ జయచంద్రారెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల, ఏవో నాగశివారెడ్డి పాల్గొన్నారు.

బి.కొత్తకోట: మండలంలోని 53 ప్రాథమిక, 6 ప్రాథమికోన్నత, 7 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలిక పాఠశాల, ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్, అంబేడ్కర్ ఎస్సీ గురుకుల పాఠశాల, అన్నింటిలోనూ హాజరైన విద్యార్థులకు జగనన్న విద్యా కానుక అందజేశామని ఎంఈవో రెడ్డిశేఖర్ తెలిపారు. ప్రతి విద్యార్థికి ఒక బ్యాగ్ బెల్టు, డిక్షనరీ, మూడు జతల యూనిఫాం, పాఠ్యపుస్తకాలను అందజేశారు. 4955 విద్యార్థులకు ఈ సంవత్సరం జగనన్న విద్యా కానుక ప్రభుత్వం నుంచి మండలానికి పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. రెండు రోజుల్లో అందరికి షూ కూడా పంపిణీ చేస్తామని తెలిపారు. అన్ని పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో తల్లిదండ్రుల కమిటీలు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేవీపల్లె : జగనన్న విద్యాకానుక కిట్లు పేద విద్యార్థులకు వరమని ఎంపీపీ ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ గజ్జెల శృతి అన్నారు. సోమవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్ వద్ద విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు సైఫుల్లాఖాన్, ఎంపీడీవో లతీఫ్‌ఖాన్, ఎంఈవో రెడ్డిబాషా, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రెడ్డిప్రదీప్, జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం వై.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురం: విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కొత్తమంచూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీలక్ష్మి అన్నారు. సోమవారం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సతీష్, హెచ్ఎం భాగ్యమ్మ, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

కలకడ : మండలంలోని ఏపీ రెసిడెన్సియల్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఎంపీపీ శ్రీదేవి, సింగిల్ విండో అధ్యక్షులు కమలాకర్‌రెడ్డి జగనన్న విద్యా కానుక కిట్‌లు అందజేశారు. కోన ఉన్నత పాఠశాలలో సర్పంచ్ జల్లారాజగోపాల్‌రెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు సరళ, మండల రైతు భరోసా కేంద్రం చైర్మన్ హరినాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, మాధవరెడ్డి, ఎనుగొండపాళ్యంలో మండల ఉపాధ్యక్షులు ఈశ్వర్‌నాయుడు, సర్పంచ్ మంజుల, తండాలో డాక్టర్ సురేష్‌నాయక్, ఆదర్శ పాఠశాలలో చైర్మన్ కెఎస్ మస్తాన్, అన్ని పాఠశాలలో ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొని విద్యార్థులకు అందజేశారు.

తంబళ్లపల్లె: ప్రతి ఒక్కరూ చదువుకున్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి తెలిపారు. మోడల్ స్కూల్‌లో జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ హేమంత్‌కుమార్, పాఠశాల కమిటీ చైర్మన్ సలీమ్, ఎంఈవో త్యాగరాజు, వైస్ ఎంపీపీ కరీమ్, ఎంపీటీసీ సభ్యురాలు సరోజమ్మ, నాయకులు కోటిరెడ్డి, శ్రీనివాసులు, భద్ర, తదితరులు పాల్గొన్నారు.

కురబలకోట: అంగళ్లు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ బి. దస్తగిరి, సర్పంచ్ పోరెడ్డి విశ్వారెడ్డి విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఎంఈఓ ద్వారకనాథ్ మాట్లాడుతూ మండలంలో 3787 జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

'జగనన్నకు చెబుదాం'తో సత్వర పరిష్కారం



23వ వార్డు రేషన్ సరఫరా అవకతవకలపై ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తున్న ప్రజలు

మదనపల్లె : ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంతో సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ అన్నారు. సోమవారం సబ్ కలెక్టరేట్‌లో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాల ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పట్టణంలోని 23వ వార్డులో ఎండీయూ వాహనాలతో రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయకపోగా, ప్రైవేట్ వ్యక్తుల పర్యవేక్షణలో డీలర్లు, వలంటీర్లు, వీఆర్వోలు కుమ్మక్కై కేటాయించిన బియ్యంలో సగం మాత్రమే పంపిణీ చేస్తున్నారని వార్డు ప్రజలు ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. 23వ వార్డులోని షాపు నెం.3, 4ల నుంచి వార్డుకు సమీపంలోనే పంపిణీ జరిగేలా చూడాలని, అవకతవకలను అరికట్టాలని వినతి చేశారు. మదనపల్లె మండలం పోతపోలు గ్రామానికి చెందిన కుంటప్పగారి అచ్చమ్మ 1999లో రెవెన్యూ అధికారులు తన పేరున మంజూరు చేసిన డి–ఫారం పట్టాకు సంబంధించి పాసుబుక్కులు ఇచ్చినప్పటికీ ఈరోజు వరకు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయలేదని ఫిర్యాదు చేసింది. దీంతో తనకు ప్రభుత్వం నుంచి అందాల్సిన రాయితీలు, రైతుభరోసా తదితర పథకాలు అందడం లేదని, భూవివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సిందిగా కోరింది. బసినికొండ అంబేడ్కర్ కాలనీకి చెందిన అగరం మంజుల పామయ్యగారిపల్లె ఖాతా నెం.87, సర్వే నెం.46/2లో 2.24 సెంట్ల భూమి ఉందన్నారు. దీనికి సరిహద్దులు, కొలతలు చూపించాల్సిందిగా మండల సర్వేయర్‌ను కోరితే భూమి 1.80 సెంట్లు మాత్రమే ఉందని చెప్పుతున్నాడని, తన భూమిని ఈ–పాసుపుస్తకం, ఆర్వోఆర్, 1బీ ప్రకారం కొలిచి చూపాల్సిందిగా అర్జీ సమర్పించింది. రామసముద్రం మండలం ఆర్.నడింపల్లె పంచాయతీ దిగువబొంపల్లెకు చెందిన శివసుధాకర్ 30 ఏళ్లుగా తమ సాగులో ఉన్న ప్రభుత్వ భూమి సర్వేనెంబర్.51లోని 2 ఎకరాలకు తన పేరు మీద డి–ఫారం పట్టా మంజూరు చేయాల్సిందిగా కోరారు. మున్సిపాలిటీలో జరిగిన స్పందన కార్యక్రమంలో యమునా మ్యూచువల్ ఎయిడెడ్ లేబర్ కాంట్రాక్ట్ సొసైటీ తరపున మున్సిపాలిటీలోని వివిధ విభాగాల్లో పని చేస్తుండగా, తొలగించిన కార్మికులను కోర్టు ఉత్తర్వు ప్రకారం తిరిగి విధుల్లో చేర్చుకోవాల్సిందిగా అర్జీ సమర్పించారు. చంద్రాకాలనీలో పైప్‌లైన్ దెబ్బతినడంతో నీళ్లు సరిగ్గా రావడం లేదని, రిపేరీ చేయాల్సిందిగా కోరారు. చలపతిరావుకాలనీలో తన ఇంటి వెనుక ఆరు అడుగుల సందు దారిలో గాలి, వెలుతురు రాకుండా ఇతరులు మోల్డింగ్ వేశారని జావీద్ ఫిర్యాదు చేశాడు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి




మదనపల్లె సిటీ : ర్యాలీ నిర్వహిస్తున్న ఫోర్డు సిబ్బంది

మదనపల్లె సిటీ : బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ఫోర్డు సంస్థ డైరెక్టర్ లలితమ్మ అన్నారు. సోమవారం ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని చంద్రకాలనీ, లక్ష్మినగర్‌లలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించిందని తెలిపారు. నాడు–నేడుతో కార్పొరేట్ స్థాయిలో ఉన్నాయన్నారు. పిల్లల్ని చదవిస్తామని, పనికి పంపబోమని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఫోర్డు సిబ్బంది రాధారాణి, అల్తాఫ్, సంపూర్ణ, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలకు ఐసీడీఎస్ అధికారులు, ఉద్యోగులు కృషి చేస్తున్నట్లు ఐసీడీఎస్ బి.కొత్తకోట ప్రాజెక్టు సీడీపీఓ కే.భాగ్యమ్మ అన్నారు. బాల కార్మికుల నిర్మూలనపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పిల్లల చదువులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి పథకాలు, కార్యక్రమాలను అమలు చేస్తున్నట్టు చెప్పారు. అనంతరం జయశ్రీ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భవతులు, బాలింతలతో సమావేశం నిర్వహించి వారికి ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సకాలంలో అందిస్తున్నారా లేదా అని విచారణ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు హిజాద్‌ప్యారీ, మంజులకుమారి, నాగరత్న, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగవేణి, శ్రీదేవి, రమాదేవి, అరుణ, లక్ష్మీ, అనసూయ, జయశ్రీ, సచివాలయ మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమండ్యం: మండలంలోని బండ్రేవులో బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫోర్డు సంస్థ మండల కో ఆర్డినేటర్ నరసింహులు, సిబ్బంది, వలంటీర్‌లు, ఆశ వర్కర్‌లు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు ఘనంగా వీడ్కోలు



హజ్‌యాత్రికున్ని ఆలింగనం చేసుకుంటున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం నుంచి 40 మంది సోమవారం సాయంత్రం హజ్‌యాత్రకు బయలుదేరారు. వీరు మదనపల్లె నుంచి బస్సులో విజయవాడకు బయలుదేరి వెళ్లారు. మొదట స్థానిక జామియా మసీదులో మగ్రిబ్ నమాజ్ అనంతరం హజ్ యాత్రికులకు వీరి కుటుంబీకులు, ముస్లిం పెద్దలు వీడ్కోలు పలికారు.

ఎమ్మెల్యే పర్యవేక్షణ

హజ్‌కు వెళ్లే యాత్రికుల యాత్రను ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా దగ్గరుండి పర్యవేక్షించారు. జామియా మసీదులో జరిగిన ప్రార్థనల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. బెంగుళూరు బస్టాండు వద్దనున్న ప్రత్యేక బస్సు వద్దకు చేరుకుని హజ్ యాత్రికులందరిని ఆప్యాయంగా పలకరిస్తూ యాత్ర సురక్షితంగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నూర్ అజాం, కౌన్సిలర్ వసీం, ముఫ్తీ షాజహాన్, జామియా మసీదు మత పెద్ద జలాలుద్దీన్‌సాహెబ్, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ టౌన్ ప్రెసిడెంట్‌గా అన్సర్‌బాషా



అన్సర్‌బాషాకు నియామక ఉత్తర్వులు అందిస్తున్న బందెల గౌతమ్‌కుమార్

మదనపల్లె : బహుజన్ సమాజ్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్‌గా అన్సర్‌బాషాను నియమించినట్లు ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతమ్‌కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక బీఎస్పీ కార్యాలయంలో టౌన్ ప్రెసిడెంట్ అన్సర్‌బాషాకు నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా బందెలగౌతమ్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలను కలుపుకొని రాజ్యాధికారంలో భాగస్వాములు చేయడమే లక్ష్యంగా బీఎస్పీ పని చేస్తుందన్నారు. పూలే, అంబేడ్కర్, కాన్షీరాం ఆలోచనలతో బెహన్‌కుమారి మాయావతి నాయకత్వంలో బీఎస్పీ బలోపేతానికి కృషి చేయాల్సిందిగా టౌన్ ప్రెసిడెంట్ అన్సర్‌బాషాకు సూచించారు. తన మీద నమ్మకం ఉంచి టౌన్ ప్రెసిడెంట్‌గా నియమించినందుకు బీఎస్పీ రాష్ట్రనాయకులు బందెలగౌతమ్‌కుమార్‌కు అన్సర్‌బాషా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు సహదేవ, రమణ, గంగాధర, పెద్దోడు, లక్ష్మీపతి, శ్రీనివాసులు, మాసువల్లి, మహేష్, నిఖిల్, అరుణ్‌శివ, అనిల్, బాసిత్, హరిరెడ్డి, మోహన్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న దండు జగన్‌మోహన్‌రెడ్డి

పీలేరు : మండలంలోని గూడరేవుపల్లెలో గుంటిగంగమ్మ గుడి అభివృద్ధికి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి రూ.15 వేలు విరాళం అందజేశారు. సోమవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి విరాళాన్ని గ్రామస్తులకు అందజేశారు. అలాగే ఆలయానికి అవసరమైన స్థలాన్ని జగన్‌మోహన్‌రెడ్డి ఉచితంగా వితరణ చేశారు. దీంతో గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రైవేటుకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలు



మాట్లాడుతున్న సీడీపీవో భారతి

వాల్మీకిపురం: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో భారతి తెలిపారు. సోమవారం పట్టణంలో అంగన్‌వాడీ 4వ కేంద్రంలో జనభాగిదారీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 3 నుంచి 6 సంవత్సరాల పిల్లల తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులకు పూర్వ ప్రాథమిక విద్య కార్యక్రమంపై అవగాహన కలిగించామన్నారు. ప్రీ స్కూల్ మెటీరియల్‌ని ప్రదర్శించి, పూర్వ ప్రాథమిక వర్క్‌బుక్స్‌ని పిల్లల చేత రాయించామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్యాబోధన కొనసాగుతుందన్నారు. అనంతరం బాలకార్మిక నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని అంగన్‌వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి, అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రోహిణి, నౌషద్, కుమారి, అనిత తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిదేళ్లయినా ప్రత్యేక హోదా ఇవ్వని బీజేపీ



మాట్లాడుతున్న వీసీకే నాయకుడు శివప్రసాద్

మదనపల్లె : పవిత్ర పుణ్యక్షేత్రం తిరుపతిలో వెంకటేశ్వర స్వామి పాదాల చెంత నిల్చుని, పక్కన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లను పెట్టుకుని ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా, ప్యాకేజీ, రాజధాని, పోలవరానికి నిధుల కేటాయింపు, విభజన హామీలను అమలు చేస్తామన్న బీజేపీ ప్రధానమంత్రి నరేంద్రమోదీ తొమ్మిదేళ్లయినా ఎందుకు అమలు చేయలేదని వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం.శివప్రసాద్ ప్రశ్నించారు. సోమవారం వీసీకే పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రెండురోజులుగా పర్యటిస్తున్న బీజేపీ నాయకులు నడ్డా, అమిత్‌షాలు గతంలో రాష్ట్రప్రజలకు ఇచ్చిన హామీలను ఏమేరకు నెరవేర్చారో తెలపాలని కోరారు. ఎందరో ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేస్తూ, సీమాంధ్రుల ఆస్తిని అదానీకి అప్పజెప్పేందుకు బీజేపీ రంగం సిద్ధం చేసిందని, అలాంటప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఏపీ ప్రజల ముందుకు వచ్చారని నిలదీశారు. గత ఎన్నికల్లో ఏపీ ప్రజలు చాలా చోట్ల బీజేపీ కంటే నోటాకు ఎక్కువ ఓట్లు వేశారని, దీనికి సిగ్గుపడకపోగా, పొత్తులతో మళ్లీ ప్రజలను ఏమార్చేందుకు బీజేపీ నాయకులు ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. బీజేపీ మునిగిపోయే పడవని, దానితో ఎవరు జతకట్టినా నిండా మునిగిపోవడం ఖాయమని వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీతో కలిసి పోటీ చేసే పార్టీలకు ఓటమి తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వీసీకే నాయకులు ముత్యాలమోహన్, గిన్నెలమనోహర్, సొన్నికంటిరెడ్డెప్ప, రాయల్‌సూర్య తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయుల కృషి ఆదర్శంగా ఉండాలి

కలకడ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి ఉపాధ్యాయుల కృషి పోటీతత్వంతో ఆదర్శంగా ఉండాలని కోన సర్పంచ్ జల్లా రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం బదిలీపై వచ్చి కోన ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టిన చంగల్‌రాయుడును సన్మానించి స్వాగతం పలికారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులకు ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల కమిటీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితురాలు సరళ, మండల ఆర్‌బీకే చైర్మన్ చింతకుంట హరినాథరెడ్డి, వైఎస్సార్‌సీపీనాయకులు మధుసూదన్‌రెడ్డి, మాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేని రోడ్డు కోసం టీడీపీ ధర్నా

వివాదాస్పదంగా మారిన దారి సమస్య

కురబలకోట : రెవెన్యూ రికార్డుల్లో లేని రోడ్డు కోసం టీడీపీ నాయకులు ధర్నా చేసిన నిర్వాకం కురబలకోట మండలంలో సోమవారం చోటు చేసుకుంది. మరో రైతు పట్టా భూమిలో రోడ్డుకు భూమి వదలాలని టీడీపీ నాయకులు, అనుచరులు, బాధిత రైతులతో కలసి సోమవారం సంఘటన స్థలంలో ధర్నా నిర్వహించారు. ఇరు వర్గాల పరస్పర కథనం మేరకు వివరాలలోకి వెళితే.. మండలంలోని మట్లివారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు డీపీ రమణారెడ్డి, అదే గ్రామానికి చెందిన ఆర్సీ కురవపల్లెకు చెందిన టీడీపీ మాజీ సర్పంచ్ రుద్ర సరస్వతి, ఆమె భర్త రుద్ర బాలకృష్ణకు గ్రామంలోని గొడసానివారిపల్లె వద్ద భూములు ఉన్నాయి. వీటిలో మొదట డీపీ రమణారెడ్డికి చెందిన భూములున్నాయి. ఇది సెటిల్‌మెంట్ భూమి కావడంతో ఆయన భూమి ద్వారా ఎవ్వరూ రాకపోకలు సాగించకుండా జేసీబీతో ఇటీవల ట్రెంచ్ కొట్టాడు. దీంతో వెనుక వైపున భూములున్న వారికి దారి లేకుండా పోయింది. ఇతని భూముల వెనుకే టీడీపీ నాయకుడు రుద్ర బాలకృష్ణ భూములున్నాయి. ఇతనికి పంట పొలాలకు వెళ్లడానికి దారి లేకుండా పోయింది. గతంలో ఇతను పంట పొలాలకు వెళ్లడానికి ఏకంగా తారు రోడ్డే వేయించుకున్నారు. అప్పట్లోనే ఇది వివాదాస్పదంగా మారింది. ఇవి సెటిల్‌మెంట్ భూములు కావడంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు నేరుగా జోక్యం చేసుకోలేని పరిస్థితి. అంతేగాకుండా సదరు భూ వివాదం ఇరువర్గాల మధ్య రెండేళ్లుగా నడుస్తోంది. ఇటీవల ట్రెంచ్ కొట్టడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. దీంతో టీడీపీ శ్రేణులు రుద్ర బాలకృష్ణ ఆధ్వర్యంలో సంఘటన స్థలంలో ధర్నా, నిరసన వ్యక్తం చేశారు. చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని ముదివేడు ఎస్ఐ ముజీబ్ తాజ్ వారిని విరమింపజేశారు. అనంతరం వారు రెవెన్యూ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. తహశీల్దారు ఎం.భీమేశ్వరరావు ఇరు వర్గాల వాదనలు విన్నారు. అనంతరం ఆయన ఈ విషయమై విలేకరులతో మాట్లాడుతూ గొడసానివారిపల్లె వద్ద సర్వే నంబరు 902లో ఆరు ఎకరాల 98 సెంట్ల భూమి ఉందన్నారు. ఇదంతా సెటిల్‌మెంట్ భూమిగా రెవెన్యూ రికార్డులలో ఉందన్నారు. ఈ భూముల్లో దారి ఉన్నట్లు ఏ రెవెన్యూ రికార్డులో కూడా లేదన్నారు. డీపీ రమణారెడ్డి రాకపోకలకు వీలు లేకుండా ట్రెంచ్ కొట్టాడన్నారు. అయితే ఇది అతని సెటిల్‌మెంట్ భూమి కావడంతో నేరుగా జోక్యం చేసుకోలేని పరిస్థితి అన్నారు. అదే సందర్భంలో మరో వైపు రుద్ర బాలకృష్ణ దారి కావాలని కోరుతున్నాడన్నారు. రెవెన్యూ రికార్డులలో ఎలాంటి రోడ్డు లేదన్నారు. ఇది సామరస్యంగా పరిష్కారం కావాల్సిన విషయమన్నారు. దీనిపై ఇరు వర్గాల వారితో చర్చించి వారం రోజుల్లో తగు పరిష్కార చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు.

మంచి చేసే ప్రభుత్వాన్ని ఆదరించండి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జి.వి.రాకేష్‌రెడ్డి

పీలేరు : నిరంతరం ప్రజల సంక్షేమం కోసం మంచి చేసే ప్రభుత్వాన్ని ఆదరించాలని యువపారిశ్రామికవేత్త జి.వి.రాకేష్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక సైనిక్ నగర్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త పథకాలతో ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ ఆనంద్, వార్డు మెంబరు ఉదయ్‌కుమార్, వైస్ ఎంపీపీ చలపతి, లావణ్య, నరేష్‌రామ్‌కుమార్‌రెడ్డి, సాంబశివారెడ్డి, పెద్దోడు, విజయశేఖర్‌రెడ్డి, గోవర్ధన్, నరేంద్రరెడ్డి, ఉమాకాంత్‌రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యలో సింగిల్ మేజర్ సబ్జెక్టులు

పీలేరు రూరల్ : నూతన విద్యావిధానంలో భాగంగా ఈ ఏడాది నుంచి డిగ్రీ విద్యలో సింగిల్ మేజర్ సబ్జెక్టులు ప్రవేశ పెట్టినట్లు స్థానిక సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎస్‌జీ డిగ్రీ కళాశాల నోడల్ రిసోర్స్ సెంటర్‌లో ఆంగ్లభాష నైపుణ్యాలపై శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు సామాజిక అవసరాలకు అనుగుణంగా తమ నైపుణ్యాలను, బోధనా విధానాలను మెరుగుపరచుకోవాలన్నారు. కళాశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు డాక్టర్ బాబు మాట్లాడుతూ డిగ్రీ స్థాయిలో పూర్తిగా ఆంగ్ల మాధ్యమం అమల్లో ఉన్నందున అధ్యాపకులు తమ ఆంగ్లభాషా నైపుణ్యాలు పెంపొందించుకోవడానికి ఆరు రోజులు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ రిసోర్స్ సెంటర్ సమన్వయకర్త డాక్టర్ నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.